


సమాచారం

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక



మొయినాబాద్ రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 19న విద్యార్థుల ఎంపిక జరుగుతుందని మొయినాబాద్ మండల విద్యాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురువారం మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాల ఆవరణలో జరిగే ఎంపికకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు రన్నింగ్, జంపింగ్ పోటీలతో పాటు ఫ్లెక్సిబిలిటీ, మెడికల్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. ఆధార్‌కార్డు, బోనఫైడ్, కులం సర్టిఫికెట్, ప్రోగ్రెస్ కార్డుతో హాజరు కావాలన్నారు.

కొత్తూరు: 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతి క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోరకు గురువారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కొత్తూర్ ఎంఈవో అంగోర్‌నాయక్ పేర్కొన్నారు. 8 నుంచి 9 సంవత్సరాల లోపు వయసు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9963081675, 9704941074 నెంబర్లలో సంప్రదించాలని ఎంఈవో కోరారు.



ప్రతీ సంవత్సరం జూన్ వచ్చిందంటే చాలు పేద, మధ్య తరగతి కుటుంబాల తోపాటు అన్నదాతల్లో ఖర్చు గుబులు పుట్టిస్తోంది. వచ్చే 11 నెలలు సాఫీగా సాగాలంటే ఈ నెలలో భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా పిల్లల ఫీజులు, పుస్తకాల ధరలు ఏటేటా పెరిగిపోతుండటంతో సామాన్యులు భరించలేకపోతున్నారు. వాటికోసం పెద్ద మొత్తంలో అప్పు చేయాల్సి వస్తుంది. అలాగే రైతన్నలు ఈ నెలలో వ్యవసాయ పనుల్లో బిజీగా గడుపుతుంటారు. ప్రతీ సంవత్సరం విత్తనాలు, ఎరువుల, కూలీల రేట్లు కూడా పైపైకి పోతుండటంతో అప్పుల కోసం పరుగులు పెడుతున్నారు. అంతేకాకుండా వానాకాలం సీజన్ కావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఆస్పత్రుల ఖర్చులు కూడా తడిసి మోపెడవుతుండటంతో సామాన్యులు సతమతమవుతున్నారు.

పైసల పాట్లు!

ఓ వైపు స్కూల్ ఫీజులు.. మరోవైపు సాగు పెట్టుబడి

- సాగుదారులు, సామాన్యులకు గుబులు రేపుతున్న జూన్ నెల
- ప్రతీ సంవత్సరం పెరుగుతున్న ఫీజులు, పుస్తకాల ధరలు
- రెట్టింపవుతున్న విత్తనాలు, ఎరువుల రేట్లతో అధిక భారం
- అప్పుల కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్దకు పరుగులు

రంగారెడ్డి అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను మంచి ఎడ్యుకేషన్ ఇవ్వాలనే ఉద్దేశంతో చాలామంది ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తుంటారు. ఇదే అదునుగా చూసుకొని ప్రైవేట్ విద్యా సంస్థలు పిల్లల తల్లిదండ్రుల ఉంచి భారీగా డబ్బులు లాగేస్తున్నారు. చదువుల ఖర్చు ప్రతీ సంవత్సరం విపరీతంగా పెరుగుతుంది. ఫీజులు, దుస్తులు, షూస్, పుస్తకాలు, బ్యాగులు తదితర సామగ్రితో పాటు రవాణా చార్జీలు వేలల్లో చెల్లించాల్సి వస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి పుస్తకాలు, పెన్నులు, నోట్‌బుక్కుల తదితర వాటిపై 10 శాతం ధరలు పెరిగాయి. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు వేలల్లో ఫీజులు కట్టాల్సి వస్తుంది. ఇక హాస్టల్‌లో ఉంటే అదనపు బాదుడు తప్పదు. ఇక కళాశాల, ఇంజినీరింగ్ చదివి విద్యార్థులకు లక్షల రూపాయలు ఖర్చు పెట్టక తప్పదు. ఇందుకోసం ఎక్కువ

మిగతా 8వ పేజీలో...

సాగు ఖర్చు వివరాలు

దున్నకం	2,500
కల్టివేటర్	1,800
రోటోవేటర్	1,500
ప్లవ్	2,400
మినీ ప్లవ్	1,500
గుంటుక	1,200
కరిగెటు	2,500
విత్తేందుకు	1,500
ఎరువులు	14,000
మొత్తం	28,900

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు (రూ.లలో)

నర్సరీ	26,000
1వ	32,000
2వ	34,000
3వ	36,000
4వ	38,000
5వ	40,000
6వ	42,000
7వ	44,000
8వ	46,000
9వ	48,000
10వ	50,000

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పట్నం మహేందర్‌రెడ్డితో ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, జూన్18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని స్థానికంగా మరింత బలోపేతం చేయాలని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. ఇటీవల పీసీసీ ప్రధానకార్యదర్శిగా నియామకమైన ఏనుగు జంగారెడ్డి బుధవారం మహేందర్‌రెడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి దశలవారీగా అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా కలిసి పనిచేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఏనుగు జంగారెడ్డి మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



ఉత్తమ ఖాతాదారులను సన్మానిస్తున్న డీసీవో సుధాకర్

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

▸▸ నాబార్డ్ డీసీవో సుధాకర్

చేవెళ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని నాబార్డ్ డీసీవో సుధాకర్ తెలిపారు. బుధవారం చేవెళ్లలోని సహకార బ్యాంకు కార్యాలయంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. చేవెళ్ల సొసైటీ బ్యాంకులో ఉత్తమ ఖాతాదారులైన మధుసూదన్‌రెడ్డి, ఆనంద్, గిరీష్‌రెడ్డిలను బ్యాంకు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీడీఎం హర్ష, డీసీసీబీ ఎఫ్ఎల్సీ లక్ష్మీకాంత్, డీసీవో నాగేశ్వర్, చేవెళ్ల బ్రాంచి మేనేజర్ బాలకృష్ణ, కార్యదర్శి వెంకటయ్య, డైరెక్టర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

- నిర్లక్ష్యంలో నిర్వాహకులు
- కనిపించని గాలిపంపులు
- అందుబాటులో లేని టాయిలెట్లు, తాగునీరు,
- పట్టించుకోని అధికారులు

నిబంధనలు గాలికి..

పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువు



పెట్రోల్ బంక్‌లో నిరుపయోగంగా ఉన్న గాలి పంపు

నందిగామ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలంలో దాదాపు 11 పెట్రోల్ బంకులున్నాయి. ఇందులో ఇండియన్ ఆయిల్ 3, భారత్ ఆయిల్ 4, హిందుస్థాన్ ఆయిల్ 2, రిలియన్స్ జియో 1, నయారా 1 ఉన్నాయి. బంకుల్లో వినియోగదారులకు కనీస వసతులు కరువయ్యాయని వాహనదారులు వాపోతున్నారు. అయితే కొన్ని పెట్రోల్ బంకుల్లో వసతులు ఉన్నా ఉపయోగించలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంకుల్లో కనీస వసతులు ఉండాలన్న నిబంధనలున్నప్పటికీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పెట్రోల్, సీఎన్జీ బంకుల్లో వినియోగదారులకు టాయిలెట్లు, తాగునీరు, వాహనదారులకు ఉచితంగా టైర్లకు గాలి తదితర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి. కానీ అవేవి బంకుల్లో కనిపించడం లేదని

మిగతా 8వ పేజీలో...



నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



వాహనదారులకు కనీస వసతులు కల్పించని పెట్రోల్ బంకు నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. కనీసం బంకుల్లో వాహనాల టైర్లకు గాలి సౌకర్యం, తాగడానికి మంచి నీరు, టాయిలెట్ సౌకర్యం కల్పించాలి. అధికారులు బంకులను పర్యవేక్షిస్తూ ప్రజలకు కల్పించే వసతులపై చర్యలు తీసుకోవాలి.

- సాయిబాబా, సీపీఎం నాయకుడు, నందిగామ



అక్రమంగా నర్సరీల నిర్వహణ

- కూరగాయ పంటల నారు విక్రయాలు
- నకిలీతో నష్టపోతున్న రైతులు

7

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

▸▸ డీపీవో సురేశ్‌మోహన్



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్, ఏపీవో రఘు

ఆదిభట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సురేశ్‌మోహన్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండుమైలారం గ్రామాన్ని ఆయన సందర్శించి పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో నిర్వహించాల్సిన పనులను క్రమం తప్పకుండా నిర్వహించి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వర్షాకాల సీజన్ కావడంతో గ్రామంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ వాటర్ సరఫరా సరిగా ఉండేలా చూసి, వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని సూచించారు. గ్రామ పంచాయితీ నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి మొక్కల పెరుగుదల గురించి అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడానికి తీసిన గుంతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తడి,పొడి చెత్త వేరు చేసే విధానాన్ని మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రఘు, పంచాయితీ కార్యదర్శి వీ. శివకుమార్, గ్రామపంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మేడిపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు

పాత హాస్టల్ భవనాన్ని పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలుచేపట్టారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం డివిజన్ పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీనివాస్ బుధవారం మేడిపల్లి గ్రామంలోని పాత హాస్టల్ గదులను పరిశీలించారు. భవనంలో వసతుల కల్పనకు రూ.15లక్షల మేర నిధులు అవసరమవుతాయని డీఈ చెప్పారు. ఆయన వెంట డాక్టర్ పి.రవీందర్, మాజీ సర్పంచ్ బోడకృష్ణ కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి తదితరులున్నారు.



మేడిపల్లిలో హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ డీఈ శ్రీనివాస్



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

▸▸ కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 56.33 శాతం ఇందిరమ్మ ఇళ్లు గ్రౌండింగ్ కాగా, ఇంకా 43 శాతం పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈనెల 25లోపు ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే వాటిని రద్దు చేసి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సూచించారు. మొయినాబాద్, నార్సింగ్ ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపాలిటీల్లో ఇండ్ల నిర్మాణాలు స్లోగా ఉన్నాయని స్పీడ్ పెంచాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామ, మున్సిపల్ పరిధిలో ఈనెల 20 నుంచి 28 వరకు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ పరిధిలో నీరు నిలిచే గుంతలను వెంటనే పూడ్చాలన్నారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి గుంతలు తీయించాలన్నారు. అవసరమైన మొక్కలు నర్సరీలలో అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ఆయన తెలిపారు. సమావేశంలో డీఆర్వో సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, డీపీవో సురేష్ మోహన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి కేషురామ్, హౌజింగ్ పీడీ హనుమంతు నాయక్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరి, డీఈవో సుశీంద్రరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ భారతి చట్టం అమలు

భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో వెలిసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలను నిర్వహించారు. ఆలయ 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలలో భాగంగా బుధవారం వ్రతాలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. ఆలయ ధర్మకర్త కట్టా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు.



ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటుతాం

▸▸ డీఆర్‌డీవో పీడీ శ్రీలత

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గతేడాది వన మహోత్సవంలో నాటిన మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటుతామని డీఆర్‌డీవో పీడీ శ్రీలత ఆంధ్రజ్యోతితో తెలిపారు. జిల్లాలోని 528 గ్రామపంచాయతీలలో ఈసారి 41.72లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్రతీ గ్రామపంచాయతీలో 10వేల మొక్కలు నాటించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు అద్భుతం

▸▸ ఇండియన్ ఎకనామికల్ సర్వీసెస్ అధికారుల కితాబు

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు బాగున్నాయని ఇండియన్ ఎకనామికల్ సర్వీసెస్ అధికారులు కితాబిచ్చారు. వీరు నగరంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందుతున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నర్సరీ, డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతి వనం, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి మండలాధికారులను అభినందించారు. పర్యటనలో ఐఈఎస్ అధికారులు అనామిక కుమార్, శివాని చౌహాన్, ఎన్ఐఆర్‌డీ అధికారులు ఉపేందర్, పీపీ సాహు ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం



ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి,జూన్ 18(ఆంధ్రజ్యోతి):పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగి మునిసిపల్ పరిధిలో 299మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. రూ.84లక్షలతో నిర్మించిన బాల సదనం భవనాన్ని.. 2, 3, 11వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఇస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.2కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేశామని, మరో రూ.25కోట్ల పనులను ప్రారంభిస్తామని చెప్పారు. పరిగి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీల చైర్మన్‌లు బి.పరశురాంరెడ్డి, బీఎస్.ఆంజనేయులు, తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, బి.భీంరెడ్డి, కార్యదర్శి కె.హన్మంతు ముదిరాజ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, పార్టీ నాయకులు ఎన్.రామకృష్ణ, అక్బర్ సేట్, అయ్యూబ్, వెంకటేశ్ చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మందు పిచికారీతో ఎండిన పంట

● నష్టపోయి బోరుమంటున్న రైతు



రామన్నగూడలో వాడుతున్న టమాట, మిరప పంటలు



చేవెళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు పురుగుల మందు పిచికారీ చేయగా పంట చేతికందే సమయంలో మొక్కలన్నీ వాడుతున్న సంఘటన మండల పరిధి రామన్నగూడలో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామన్నగూడకు చెందిన ఎండీ మక్బూల్‌కు 30గుంటల భూమి ఉంది. 20గుంటల్లో బజ్జీ మిర్చి మల్చింగ్ విధానం ద్వారా, పది గుంటల్లో టమాట సాగుచేశాడు. రెండు పంటలకు కాత బాగా రావాలని రైతు చేవెళ్లలోని ఫర్టిలైజర్ దుకాణంలో రూ.950 చెల్లించి మందులు తెచ్చి ఈ నెల 14న పంటపై రెండు రకాల మందును ప్రతీ లీటర్ నీటికి 30ఎంఎల్ చొప్పున కలిపి పిచికారి చేశాడు. బుధవారం చూడగా మిర్చి, టమాట మొక్కలు వాడిపోయాయి. దీంతో రైతు మందులు కొన్న ఫర్టిలైజర్ షాపు యాజమాని వద్దకు వచ్చి మొక్కలను చూపించాడు. మందుల ఓవర్ డోస్ వల్లే మొక్కలు వాడుతున్నాయని షాపు నిర్వాహకుడు అంటున్నాడని రైతు తెలిపాడు. నిజానికి అతడు చెప్పిన మోతాదులోనే మందును నీటిలో కలిపానని, నకిలీ మందు వల్లే మొక్కలు నచ్చిపోతున్నాయని బోరుమంటున్నాడు. వ్యవసాయ అధికారులు తన పంటను పరిశీలించి నష్టపరిహారం ఇప్పించాలని రైతు డిమాండ్ చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో పెట్టుబడితో పాటు ఫలసాయం కూడా కోల్పోతున్నానని వాపోయాడు. అధికారులే తనకు న్యాయం చేయాలని కోరాడు. నకిలీ మందులు అమ్ముతున్న వ్యాపారిపై చర్యలు తీసుకొని, రైతులకు నష్టం కలగకుండా చూడాలని రైతు కోరాడు.



పంటలపై రైతు పిచికారీ చేసిన మందులు



ఫర్టిలైజర్ షాపు ఓనర్ ఇచ్చిన రసీదు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టు మిషన్లతో మహిళలు ఉపాధి పొందుతూ క్రమంగా ఆర్థిక వృద్ధి సాధించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆకాక్షించారు. బుధవారం బషీరాబాద్‌లో ఎస్బీ కార్పొరేషన్(ఎస్ఆర్డీఎస్) ద్వారా మూడు నెలల శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు 70 కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. తెలంగాణ అల్ప సంఖ్యాకవర్గాల ఆర్థిక సంస్థ, ఇందిరమ్మ అల్ప సంఖ్యాక మహిళా శక్తి-రేవంత్ అన్నాకా భరోసా పథకం ద్వారా కూడా 18మంది ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లను ఇచ్చామన్నారు. మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటునందించాలనే ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాహిదాబేగం, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జానకి, మాజీ ఎం పీపీ కరుణఅజయ్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు శంకరప్ప, నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌రావు, శంకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఉచిత కంది విత్తనాలను రైతులకు అందజేసి మాట్లాడారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతు వేదికల్లో అధికారుల వద్ద పొందాలని సూచించారు. ప్రభుత్వం ఎకరానికి రూ.6వేల రైతు భరోసా అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ సుధాకర్

మేడ్చల్ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వారి కోసం మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నామని మేడ్చల్ ఆర్టీసీ డిపోమేనేజర్ సుధాకర్ చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉదయం 5గంటలకు తీర్థ యాత్రల బస్సు డిపో నుంచి బయలుదేరి కాళేశ్వరం, రామప్ప ఆలయం, వరంగల్ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల గుడి దర్శించుకుని తిరిగి భక్తులను మేడ్చల్‌కు తీసుకొస్తుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ.1,200, పిల్లలకు రూ.700 ఉంటుందన్నారు. మహిళలకు ఉచిత సర్వీసు వర్తించదని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మాడ్గుల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మాడ్గులలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో లెక్చరర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ రేఖ బుధవారం తెలిపారు. జువాలజీ, బాటని, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు అవసరమన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ చేసి ఉండాలని తెలిపారు. జూన్ 30లోపు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని వివరించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



తుక్కుగూడలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వాణి, సిబ్బంది

మహేశ్వరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, పరిసరాలను, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు తోడ్పాటు అందించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం ఆయా వారుల్లో తడి, పొడి చెత్త నిర్వహణ, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్లపై చెత్త వేసిన పలువురికి జరిమానా విధించారు. అనంతరం అధికారి మాట్లాడుతూ.. ప్రజలు రోజూ తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు ఎవరికి వారు సామాజిక ఉద్యమంలా భావించి పాలుపంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతే ప్రజారోగ్యానికి మూలం అన్నారు. ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో తుక్కుగూడ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుదామని, అందుకు పట్టణ పరిధి ప్రజలు సహకరించాలన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న శాంతిశ్రీ

కందుకూరు, జూన్18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. బుధవారం మీర్కాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బడిబాటలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని తల్లును కోరారు. అక్కడ విద్యా బుద్ధులతో పాటు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ సబిత పాల్గొన్నారు.

మా భూములను నిషేధిత జాబితా నుంచి తీసేయండి



తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రమందిస్తున్న రైతులు

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూములకు విముక్తి కల్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వర్తింపజేసి ఆదుకోవాలని యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామ రైతులు రెవెన్యూ సదస్సులో రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కుర్మిద్దలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ అయ్యప్ప హాజరయ్యారు. కొందరు రైతులు వచ్చి నిషేధిత జాబితాలోని 2500 ఎకరాల పట్టా భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వాలిచ్చే పథకాలు వర్తింపచేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు వివరిస్తానని తహసీల్దార్ వారికి సర్ది చెప్పడంతో రైతులు శాంతించారు.

పుస్తకాలు విక్రయిస్తున్న స్కూల్ రూమ్ సీజ్



కేటీఎస్‌లో విక్రయిస్తున్న పుస్తకాలను పట్టుకున్న ఎంఈవో గోపాల్

పరిగి,జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పరిగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఎంఈవో గోపాల్ బుధవారం సీజ్ చేశారు. కేటీఎస్ స్కూల్ యజమాన్యమే పుస్తకాలు విక్రయిస్తున్నట్టు గుర్తించి పుస్తకాలను, విక్రయిస్తున్న గదిని సీజ్‌చేశారు. విషయాన్ని డీఈవోకు తెలియజేసినట్లు ఎంఈవో చెప్పారు. ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ పాఠ్య, నోటు పుస్తకాల విక్రయించకూడదని ఆయన సూచించాచారు. ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య తీర్చిన గ్రామస్తుడు

పూడూరు, జూన్ 18, (ఆంధ్రజ్యోతి): రేగడిమామిడిపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్య ఉందని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. బుధవారం గ్రామానికి చెందిన భూపతిరెడ్డి రూ.35వేలతో కొత్త మోటారును వేయించారు. దీంతో గ్రామంలో నీటి సమస్య తీరింది.

కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా గోపీకృష్ణ



గోపీకృష్ణను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కేశంపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపీకృష్ణ కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన ఏడీఏ రాజారత్నం ప్రమోషన్‌పై నారాయణపేట జిల్లా వెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ గోపీకృష్ణను నియమించారు. చార్జి తీసుకున్న గోపీకృష్ణను ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఎన్ఆర్‌జీఎస్ టీఏ అజీజ్ సత్కరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని, పారిశుధ్య పనుల్లో జాప్యం చేయొద్దని, మొక్కలు నాటేందుకు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేపీఆర్ఐటీ కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లోని కేపీఆర్ఐటీ కళాశాలలో బుధవారం కెరియర్ డెవలప్‌మెంట్ సెంటర్(సీడీసీ)ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు కెరియర్‌పై దృష్టిసారించాలని సూచించారు. వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తేనే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, స్ట్రాటజిక్ డైరెక్టర్ కొమ్మూరి దివ్యారెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ శ్రీనాథ్‌కశ్యప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

తాండూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి వస్తున్న తమను కొందరు కులం పేరుతో దూషించారని, వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని వచ్చిన ఫిర్యాదుపై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి బుధవారం గ్రామంలో విచారణ జరిపారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 15న చెనిగేష్‌పూర్‌నకు చెందిన బస్వరాజ్, లక్ష్మి పొలం పనులకు వెళ్లి వస్తుండగా, గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నానిగౌడ్, నరేష్‌గౌడ్, పవన్‌గౌడ్‌లు కలిసి ఎరుకలి కులం పేరుతో తమను దూషించారని, అలాగే దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఫిర్యాదు చేశారన్నారు. బాధితుల ఫిర్యాదుతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టుచెప్పారు. డీఎస్పీ గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై గ్రామస్తులతో మాట్లాడారు. కులం పేరుతో ఎందుకు దూషించారు? ఏం జరిగిందనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.



చెనిగేష్‌పూర్‌లో విచారణ జరుపుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి







డాక్టర్ కారులో 65 గ్రాముల గంజాయి

» వాహన తనిఖీల్లో దొరికిన వైనం.. వికారాబాద్‌లో ఘటన

వికారాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా ఓ వైద్యుడి కారులో గంజాయి దొరకడం వికారాబాద్‌లో తీవ్ర కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్ ఆలంపల్లి రోడ్డులో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేస్తూ ఓ ఫార్చ్యూనర్ కారును ఆపారు. వికారాబాద్‌కు చెందిన ఓ వైద్యుడు ఆ కారులో ఉన్నారు. ఆ కారులో తనిఖీ చేయగా 65 గ్రాముల గంజాయి లభించడంతో పోలీసులు ఆ వైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వైద్యుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా, 'వికారాబాద్ డాక్టర్ వద్ద గంజాయి కలకలం' అనే వార్త సోషల్ మీడియాలో వైరల్ కాగా ఇద్దరు వైద్యుల మధ్య ఉన్న పాత గొడవలే ఈ గంజాయి కేసుకు కారణమనే చర్చ జరుగుతోంది. కావాలనే సదరు వైద్యుడిని గంజాయి కేసులో ఇరికించారనే ప్రచారం ఉంది. కాగా, వికారాబాద్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సదరు డాక్టర్‌తో మాట్లాడి కేసు గురించి ఆరా తీశారు. తాను గంజాయి వినియోగించనని, కావాలనే తనని ఈ కేసులో ఇరికించారని ఆయన చెప్పడంతో తోటి డాక్టర్లు స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిశారు. ఈ కేసులో తామేమీ చేయలేమని, తనిఖీల్లో పట్టుబడిన దానిపై కేసు చేసే అధికారం తమకు ఉంటుందని వారు తేల్చిచెప్పినట్టు సమాచారం. దీంతో డాక్టర్లు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి సదరు డాక్టర్‌పై కేసు నమోదు విషయంలో కుట్ర జరిగిందనే అనుమానాలున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

మోమిన్‌పేట్/మర్పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దరఖాస్తులను పరిశీలించి అధికారులు భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. 23 గ్రామాల్లో వెయ్యి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీటీ సురేశ్‌కుమార్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, జూనియర్ అసిస్టెంట్లు మహేశ్‌గౌడ్, అలివేలు, సునీత, మౌనిక, సిబ్బంది రాఘవేందర్, రాజు, నర్సిములు, కార్యదర్శులు స్వప్న, నాయకులు సుభాష్‌గౌడ్, ఎజాజ్‌పాషా, పటేల్, రవి తదితరులు పాల్గొన్నారు. మర్పల్లి మండలం నర్సాపూర్‌లో రెవెన్యూ సదస్సుకు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హాజరయ్యారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో, డీటీ పరశురాం పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

గంజాయి విక్రయిస్తున్న బాలుడి అరెస్టు

» 3.13కిలోల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ మైనర్ బాలుడిని పోలీసులు అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన ఓ బాలుడు(17), అతడి స్నేహితుడు రవితో ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరికి వెళ్లి 3.13కిలోల గంజాయి కొని తెచ్చారు. చందుపట్లగూడ సమీపం లింగారెడ్డి వెంచర్‌లో బుధవారం గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు 3.13కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని బాలుడిని నగరంలోని జువైనల్ హోంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎస్‌వో నాయకులు

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆమనగల్లు ఇన్‌చార్జి బాలవర్షిత్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎంఈవో పాండుకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బు గుంజుతున్నారని తెలిపారు. అడ్మిషన్లు, ఫీజుల పేరుతో భారీగా దండుకుంటున్నారన్నారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్స్, స్టేషనరీ వస్తువులు అధిక ధరకు విక్రయిస్తున్నారని, ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బద్ధి రాజు, సాయి, ధనుశ్, శివరాజ్, నందు, శివకుమార్ ఉన్నారు.



కొందుర్గు-టేకులపల్లి బ్రిడ్జి పనుల వద్ద గ్రామస్తులు

టేకులపల్లి బ్రిడ్జికి మరమ్మతులు

చౌదరిగూడ,జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం టేకులపల్లి శివారులోని వాగుబ్రిడ్జి వర్షానికి కొట్టుకుపోయింది. గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి దృష్టికి తీసుకుపోయారు. ఆయన స్పందించి బ్రిడ్జి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. దీంతో బుధవారం పనులు చేశారు. బ్రిడ్జి పనులతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



బదిలీ అయిన బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లను సన్మానిస్తున్న ఎస్సై వెంకటేశ్, నాయకులు

పనితీరుతోనే ప్రజల్లో కీర్తి

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంకిత భావం, చిత్తశుద్ధి, నిస్వార్థ సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల అభిమానాన్ని పొందుతారని ఆమనగల్లు ఎస్సై బి.వెంకటేశ్ అన్నారు. ఉద్యోగులకు బదిలీలు సహజమని, పనిచేసిన చోట అందించిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఏఎస్సై బాల్‌రెడ్డి కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌కు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ నార్సింగ్‌కు బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలం సేవలందించి బదిలీ అయిన ఈ ఇద్దరు ఉద్యోగులకు బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి సేవలను కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం అవసరం ఉంటుందన్నారు. బదిలీ అయిన బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లను బీఆర్ఎస్ మునిసిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైదులుగౌడ్, పసుపుల సాయిలు పూల మాలలు, శాలువాలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై సీతారాంరెడ్డి, ఏఎస్సై రామ్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, సత్యం, దశరథం, రాములు, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నర్సరీలు

కూరగాయ పంటల నారు విక్రయాలు ● నకిలీతో నష్టపోతున్న రైతులు



చౌదర్‌పల్లిలో అక్రమంగా వెలిసిన కూరగాయల నర్సరీ

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో కూరగాయల పంటల నారును విక్రయించే నర్సరీలు పలుచోట్ల అక్రమంగా వెలిశాయి. నల్గొండ జిల్లాకు చెందిన కొందరు రహదారుల పక్కన, గ్రామాల్లో కూరగాయల నారు నర్సరీలను ఏర్పాటు చేశారు. వాటిల్లో టమాట, వంకాయ, బెండ, మిర్చి తదితర పంటల నారును విక్రయిస్తున్నారు. నల్గొండజిల్లాకు చెందిన కొందరు రంగారెడ్డి జిల్లాలో నారు నర్సరీలను ఏర్పాటు చేసి లాభాలు గడిస్తున్నారు. అయితే ఇలాంటి నర్సరీల్లో అమ్మే నకిలీ నారు కొని నాటుకున్న కొందరు రైతులు నష్టపోతున్నారు. అయితే ఇలాంటి నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలంటే ఉద్యానవన శాఖ వద్ద నమోదు చేసుకోవాలి. ఈ నర్సరీల్లో విక్రయించే నారు నాణ్యమైనదేనా? ఎలాంటి విత్తనాలు వాడుతున్నారు? వంటి అంశాలపై అధికారులు తనిఖీలు చేస్తుంటారు. ఇటీవల మాల్‌లో ఓ నర్సరీలో కొన్న నారు నాటగా పూతకాత రాలేదు. దీంతో రైతు పోలీసులకు ఫిర్యాదు చేయగా బాధిత రైతుకు నర్సరీ వారు కొంత డబ్బు చెల్లించి చేతులు దులుపుకున్నారు. కాగా జిల్లాలో 400 వరకు అక్రమ నర్సరీలు ఉన్నాయి. యాచారం, మాల్, గున్‌గల్, మాల్‌లలో కూరగాయ నర్సరీలను నిర్వహిస్తున్నారు. ఒక్క టమాట మొలక(నారు)ను 50పైసల నుంచి రూపాయికి విక్రయిస్తున్నారు. ఒక్కో మొలక లెక్కించి కట్టలు కట్టి అమ్ముతున్నారు. చౌదర్‌పల్లిలో ఓ నర్సరీ నిర్వాహకుడిని అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించగా.. 'తొందరేముంది. జిల్లా అధికారులకు దరఖాస్తు చేశా.' అని నింపాదిగా చెప్పాడు. నారు నర్సరీలపై జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్‌ను స్పందన కోరగా.. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం ప్రాంతాల నుంచి నర్సరీల ఏర్పాటుకు దరఖాస్తులేమీ రాలేదని తెలిపారు.

అనుమతితోనే నర్సరీలు నిర్వహించాలి



కూరగాయల నారు విక్రయించే నర్సరీల ఏర్పాటుకు ఉద్యాన శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు మాకు రెండుమూడు దరఖాస్తులే అందాయి. ఇప్పుడున్నవన్నీ అక్రమంగా నిర్వహిస్తున్నవే. ఇబ్రహీంపట్నం డివిజన్ నుంచి ఒక్క దరఖాస్తూ రాలేదు. రైతులు అక్రమ నర్సరీల్లో ఏ నారునూ కొనొద్దు. ఒక వేళ నకిలీ విత్తనాలతో నారు పెంచితే పంట మొత్తం నష్టపోతారు. ఇలాంటి నర్సరీలపై మాకు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం.

- సురేశ్, జిల్లా ఉద్యానవన అధికారి

శంకర్‌పల్లి అభివృద్ధికి చేయూతనివ్వాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి పట్టణం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయి చేయూతనివ్వాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళికాలో భాగంగా ఆదర్శ పాఠశాల విద్యార్థులకు తడి పొడి చెత్త వేరు చేయడం, హోం కంపోస్టింగ్‌పై చిత్రలేఖనం, రంగోలి, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 15మంది విద్యార్థులకు బుధవారం ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వారికి వివరించి పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, మేనేజర్ అంజన్‌కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ఆనంద్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, చంద్రమౌళి, మధు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

కీసర రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతలో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధి కీసరలోని మల్లికార్జుననగర్, శివాజీనగర్ కాలనీల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభు, పంచాయతీ కార్యదర్శి గంగన్న, వార్డు ఆఫీసర్ సాయిలు, దుర్గ, బిల్ కలెక్టర్లు మహేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థినులకు పోటీలు

మేడ్చల్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మేడ్చల్ బాలికల గురుకుల పాఠశాలలో స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం

చౌడాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, దుకాణా సముదాయల యజమానులు నేరాల కట్టడికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై రమేశ్ సూచించారు. బుధవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. వాటి ఏర్పాటుతో చోరీలు, ఇతర సంఘ వ్యతిరేక కార్యకలాపాలను అదుపుచేయొచ్చని అన్నారు. ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు.



డాక్టర్ వెంకటరమణను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సేవలతోనే సామాజిక గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే సామాజిక గుర్తింపు వస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ మిర్యాల వెంకటరమణ ఓ యూ ట్యూబ్ చానల్ నుంచి ఉత్తమ అవార్డును అందుకున్నారు. బుధవారం ఆయనను ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి సన్మానించారు. మనిషికి దేవుడు పోసిన ప్రాణాన్ని నిలబెట్టే శక్తి వైద్యులకే ఉంటుందని, అలాంటి వృత్తిలో ఉంటూ సేవలందిస్తున్న డాక్టర్ వెంకటరమణ ఆదర్శనీయుడని అన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో వెంకటరమణ-తులసి దంపతులను సన్మానించారు. అంతకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, ప్రముఖులు నాగిళ్ల గోపాల్‌గుప్తా, గజవాడ నర్సింహులు, సురేష్, సంగమేశ్వర్, ఆర్.కృష్ణయ్య, బాల్‌రాజ్‌గుప్తా, శివకుమార్, శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, పెంటయ్య, నారాయణ తదితరులు సన్మానించారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లు అవగాహన పెంచుకోవాలి

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సర్వేయర్ల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టాలపై అవగాహన పెంచుకొని రైతులకు సేవలందించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శామీర్‌పేట మండల పరిషత్‌లో ఈ నెల 2 నుంచి జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అధికారులు భూ భారతి చట్టంపై శిక్షణ ఇస్తున్నారు. బుధవారం కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి సర్వేయర్ల శిక్షణ పనితీరును పరిశీలించారు. రెవెన్యూ చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకం అన్నారు. శిక్షణలో శ్రద్ధగా విని, శిక్షణ అనంతరం భూముల సర్వే బాధ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీఐవో బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కులకచర్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చి 11సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం కులకచర్లలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పేదలకు ఇస్తున్న మూడునెలల ఉచిత బియ్యంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకూ కేంద్రం డబ్బులు ఇస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు తమ సత్తా చూపామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అంజయ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ సౌమ్యావెంకట్‌రామ్‌రెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బాలకిష్టారెడ్డి, మోనాచారి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, సందని బిచ్చయ్య, రవీందర్‌రెడ్డి, పోమాల నరేశ్, కొండ అంజి, వెన్నచెడ్ రాజు, సుంకు మల్లేశం, రాంచంద్రయ్య, రాజశేఖర్, మాసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

శంకర్‌పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ కోరారు. శంకర్‌పల్లి మండల పరిషత్‌లో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి హామీ మేట్లకు శిక్షణ నిర్వహించారు. ఉపాధి కింద గ్రామాల్లో భారీ సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. పండ్ల తోటలు పెంచుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. మండలంలో వన మహోత్సవం విజయవంతం అయ్యేలా సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాఠశాలకు గ్యాస్ సిలిండర్ అందజేత

పెద్దేముల్, జూన్18(ఆంధ్రజ్యోతి): తాను విధులు నిర్వహించే పాఠశాలకు ఉపాధ్యాయుడు గ్యాస్ సిలిండర్, స్టవ్ అందజేశాడు. పెద్దేముల్ మండలం ఖానాపూర్ గ్రామంలోని పాఠశాలలో పట్లోళ్ల అనిల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో సొంత డబ్బుతో గ్యాస్ అందజేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ల నిర్వహణ భారం మోయలేం



కొడంగల్ రూరల్: ఎంపీడీవో ఉషశ్రీకి తాళాలను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎంపీడీవోలకు తాళాలు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దోమ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరమైన భారాన్ని తాము భరించలేమని దోమ మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. బుధవారం వారు ఎంపీడీవో గమ్యానాయక్‌కు పంచాయతీ ట్రాక్టర్ల తాళాలు అందజేశారు. కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు మొగులయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫిబ్రవరి 2024 నుంచి నిధులు విడుదల చేయడం లేదన్నారు. ట్రాక్టర్ల నిర్వహణ భారం, బోరు మోటార్ల మరమ్మతులు, పారిశుధ్యం పనులతో ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామని వాపోయారు. అప్పు చేసి ఇన్ని రోజులు గ్రామాల్లో పనులు చేయించాం అన్నారు. 36 పంచాయతీల కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలు, వినతిపత్రాలు అందజేశారు. కొడంగల్ మండలంలోని 25 పంచాయతీల కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలను ఎంపీడీవో ఉషశ్రీకి, ఎంపీఈవో జైపాల్ రెడ్డికి అందజేశారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 16 నెలల గడిచినా ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. తాము అప్పులు చేసి పనులు చేయించడం తలకు మించిన భారంగా మారిందన్నారు. ట్రాక్టర్‌కు డీజిల్‌తో పాటు ఇతర ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కొండన్న, క్రిష్ణ, డేవిడ్, క్రిష్ణవేణి, లావణ్య, బుగ్గప్ప పాల్గొన్నారు.



దోమ: ఎంపీడీవో గమ్యానాయక్‌కు ట్రాక్టర్ తాళాలు అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు


చెక్కులు అందిస్తున్న జంగారెడ్డి, కృష్ణానాయక్, శమంతప్రభాకర్

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగించుకోవాలి

కందుకూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డిలు సూచించారు. మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బుధవారం అందజేశారు. కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ చొరవతో నేదునూరుకు చెందిన బి.శ్రీనివాస్‌కు రూ.45వేలు, ఎల్మటి నిర్మలకు రూ.60వేల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, కె.రాణాప్రతాప్‌రెడ్డి, యాదయ్య, యాగేందర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సౌడపు వెంకటేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలి

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో అసంపూర్తిగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయించి పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు నారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు రవీందర్ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు నరేశ్ నాయక్, జెల్ల రమేశ్, సంపత్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శంషాబాద్/చౌదరిగూడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో పలు బస్తీల్లో నేడు(గురువారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అఫ్సర్‌బాష ప్రకటనలో పేర్కొన్నారు. ఓల్డ్ పోలీస్‌స్టేషన్, వివేకానంద ఫీడర్ పరిధివలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏకేటౌన్‌షిప్, బాలయేసుకాలనీ, వెలంకినినగర్, కాపుగడ్డ, మెహదీగార్డన్, రుద్రాకాలనీ, రైల్వేస్టేషన్ తదితర బస్తీల్లో మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు సరఫరా ఉండదన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు

మహేశ్వరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఇవ్వకుండా మోసం చేస్తోందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం మండల రైతులకు వెంటనే రైతు భరోసా వచ్చేలా చూడాలన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రైతు భరోసాకు అర్హులైన 13వేల 470 మంది రైతులకుగాను వ్యవసాయ యోగ్యమైన భూమి 19,817 ఎకరాలు ఉందన్నారు. మహేశ్వ రం మండలంలో ఒకరిద్దరు పెద్ద రైతులు ఉండొచ్చు కానీ, చాలా మంది సన్న, చిన్న కారు రైతులే ఉన్నారని, అలాంటి వారికి కూడా రైతు భరోసా డబ్బు ఖాతాల్లో జమ చేయకపోతే ఎలా అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కె.చంద్రయ్య, నవీన్, వి.యాదగిరి, రాజునాయక్, అంబయ్య, నందం, ప్రభాకర్‌రెడ్డి, పాండు, ఆదిల్, కె.ప్రభాకర్, కృష్ణ తదితరులున్నారు.

నిబంధనలు గాలికి..

(ఐదో పేజీ తరువాయి)

ప్రజలు విమర్శిస్తున్నారు. నిబంధనలు పాటించకపోతే మొదటి మూడుసార్లు జరిమానా విధిస్తారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10వేలు, రెండవసారి అతిక్రమిస్తే రూ.25 వేలు, మూడవసారి కూడా అలాగే చేస్తే రూ.10 వేలు జరిమానా విధించి 45 రోజుల పాటు బంకులో అమ్మకాలు నిలిపివేస్తారు. కానీ నిద్రమత్తులో ఉన్న సంబంధిత అధికారులు బంకు నిర్వాహకులు ఇచ్చే తాయిలాలకు అలవాటుపడి పెట్రోల్ బంకుల్లో వసతుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

బంకుల్లో ఉచిత వసతులు..

పెట్రోల్ బంకుల్లో వాహనాల టైర్లల్లో గాలిని ఉచితంగా నింపాలి. పైసలు అడిగితే వారిపై కేసు పెట్టవచ్చు. అలాగే తాగునీరు, టాయిలెట్లు తప్పనిసరి అందుబాటులో ఉంచాలి. అత్యవసర సమయాల్లో బంకులోని టెలిఫోన్ నుంచి ఎవరికైనా ఫ్రీగా కాల్ చేసుకోవచ్చు. అదేవిధంగా ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉండాలి. వీటిని అత్యవసర పరిస్థితుల్లో వాడుకునే సౌకర్యం కల్పించాలి.

పైసల పాట్లు!

(ఐదో పేజీ తరువాయి)

మంది తల్లిదండ్రులు అప్పులకు సిద్ధమవుతున్నారు. మరికొంత మంది ప్లాట్లు, భూములు, ఇతర ఆస్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

'సాగా'లంటే భారమే..

వ్యవసాయంలో ఏటా పెట్టుబడి పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. కూలీల ఖర్చు 30 నుంచి 40 శాతం వరకు పెరిగింది. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల ధరలు రెట్టింపయ్యాయి. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో రైతులు విత్తులు విత్తారు. సరైన సమయానికి వరుణుడు కరుణించక పోవడం.. ఉష్ణోగ్రతలు పెరగడంతో విత్తిన విత్తనాలు దుక్కిలోనే మాడి పోయాయి. దీంతో పంటకు పెట్టిన పెట్టుబడులు కోల్పోయారు. మళ్లీ ప్రైవేట్‌గా అప్పులు చేస్తున్నారు. రెండో సారి విత్తులు విత్తేందుకు సిద్ధమవుతున్నారు.

వానా కాలం వ్యాధుల పంజా

వాతావరణంలో ఏర్పడిన మార్పులతో వ్యాధులు పంజా విసురుతున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో దోమల బెడద ఎక్కువైంది. జ్వరం, గొంతునొప్పి, దగ్గు తదితర సమస్యలతో ఆస్పత్రులకు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆసుపత్రుల ఖర్చు కూడా రూ. 10 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చవుతుంది. ఇంట్లో ఉండి చికిత్స చేయించుకున్నా మందులు, రక్తపరీక్షల రూపంలో రూ.5 వేలు అవుతుంది. వారం రోజులు కూలికి వెళ్లకపోతే సుమారు రూ.6 వేల వరకు ఆదాయం పోగొట్టుకునే పరిస్థితి కూలీల కుటుంబాల్లో ఏర్పడుతోంది.

పుస్తకాల ధరలు ఇలా..
(నోట్‌బుక్స్, టెక్ట్స్‌బుక్ కలిపి)

తరగతి	ఫీజు(రూ.)
నర్సరీ	2,485
ఎల్‌కేజీ	2,603
యూకేజీ	2,821
1వ తరగతి	5,617
2వ	5,852
3వ	6,807
4వ	7,594
5వ	7,922
6వ	6,680
7వ	7,800
8వ	8,000
9వ	9,000
10వ వతరగతి	12,000

పెట్టుబడి భారంగా మారుతోంది



పంట పెట్టుబడి భారంగా మారుతుంది. తొలకరి వర్షాలకు ముందుగా పత్తి విత్తనాలు విత్తినా ఎండ వేడికి మొలకెత్తలేవు. మళ్లీ దుక్కులు దున్ని విత్తులు విత్తేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో పిల్లల ఫీజులు తడిసి మోపెడవుతున్నాయి.

- వడ్ల బ్రహ్మయ్య, రైతు, తుమ్మలపల్లి, జిల్లేడు చౌదరిగూడ మండలం

ఫీజులు భరించలేకపోతున్నాం



పిల్లల ఫీజులు భరించలేకపోతున్నాం, దుస్తులు, షూస్, పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు కొనివ్వక తప్పదు. బస్సు ఫీజు కూడ కట్టాల్సి వస్తుంది. ఓవైపు పంట పెట్టుబడులు, మరోవైపు స్కూల్ ఫీజులతో ఇబ్బందులు తప్పడం లేవు. ప్రైవేట్ సూల్స్‌లో ఫీజులను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చెన్నారెడ్డి, రైతు, టేకులపల్లి

'భూ భారతి'తో సమస్యలకు శాశ్వత పరిష్కారం


షాద్‌నగర్ అర్బన్ : దరఖాస్తులు ఇస్తున్న రైతులు


షాబాద్ : రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం తాళ్లపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో కొత్త రెవెన్యూ చట్టం భూ భారతిని తీసుకువచ్చారని అన్నారు. చిన్నచిన్న భూ సమస్యలకు రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. డీటీ మధు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచులు పెంటయ్య, నాయకులు స్వామి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాణిక్యంగౌడ్, తదితరులున్నారు.

మొయినాబాద్ రూరల్ : రెవెన్యూ సదస్సులు రైతులకు ఎంతో ఉపయోగపడుతాయని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు, ముర్తుజగూడ, నాగిరెడ్డిగూడలో సదస్సులు నిర్వహించగా ఆయన రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

షాద్‌నగర్ అర్బన్ : అన్నదాతలకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి కృషితో రైతుల వద్దకే రెవెన్యూ సేవలు అందుతున్నాయని షాద్‌నగర్ ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ తెలిపారు. ఫరూఖ్‌నగర్‌లో తహసీల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించగా 17 మంది సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు.

కేశంపేట : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ ఆజంఅలీ అన్నారు. మండల కేంద్రంతో పాటు కాకునూర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కేశంపేటలో 6, కాకునూర్‌లో 5 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కేశంపేట సదస్సులో మ్యుటేషన్ చేసి ప్రొసీడింగ్ అందించారు. ఆర్‌ఐలు నివేదిత, చెన్నకేశవులు, సీనియర్ అసిస్టెంట్ మశ్చేందర్, జూనియర్ అసిస్టెంట్లు శివ, మహేష్, జంగయ్య, శివలీల, సరస్వతి, నాయకులు తలసాని వెంకట్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, రాములు, పర్వతాలు, జగదీశ్వర్ గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఈనెల 3నుంచి 18 వరకు తహసీల్దార్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో సదస్సులను గ్రామాల వారీగా రెండు బృందాలుగా విభజించి నిర్వహించారు. రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. బుధవారంతో సదస్సులు ముగిశాయి. మొత్తం దరఖాస్తులు 780 గాను 509 దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేసి 271 దరఖాస్తులను తిరస్కరించినట్లు తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, భాస్కర్, మహేందర్‌గౌడ్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష, రామస్వామి, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు ఎంతో మేలు


రైతులకు వరి విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్త చిరంజీవి

తలకొండపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతుల ద్వారా రైతులు పంటలు సాగు చేసి దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త చిరంజీవి కోరారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించాలన్నారు. బుధవారం చీపునుంతలలో రైతులకు వరివిత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సిబ్బంది, మాజీ సర్పంచ్ బండి రఘుపతి, మల్లయ్య, పెంటయ్య, నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

వ్యాపార సంస్థలుగా విద్యాసంస్థలు

కొత్తూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారాయని స్థానిక ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కొత్తూర్‌లోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ, తలిదండ్రుల శ్రమను దోచుకుంటున్నారని, బదిలీ ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ విషయమై ఎంఈవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. విద్యాధికారులు ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోకన్వీనర్ శివకుమార్‌చారి, హర్ష యాదవ్, జోగేష్, యశ్వంత్, సందీప్‌సింగ్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై ఆందోళన వద్దు

- మరో వారంలో అర్హులందరి ఖాతాల్లో డబ్బు జమ
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలో రైతు భరోసా పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ కావడం లేదని రైతులెవరూ ఆందోళన చెందవద్దని, మరో వారంరోజుల వ్యవధిలో అందరి ఖాతాల్లో నగదు జమ అవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మంత్రి తుమ్మల వ్యవసాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడారని, వారం గడువులో అందరి ఖాతాల్లో నగదు జమ చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇంకా కొందరి రైతులకు సంబంధించి రుణ మాఫీ కూడా త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారని.. ఇది రైతు ప్రభుత్వమని, అందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

ఆదిబట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ రైతుకు రైతు భరోసా పెట్టుబడి సాయం ఇవ్వాలని కప్పాడు మాజీ ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెంట్ మండాలాల పరిధిలోని ఓఆర్‌ఆర్ సమీప గ్రామాలకు రైతు భరోసా ఇవ్వకపోవడం వెనకాల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రామాలలో వ్యవసాయం చేసేవారు రైతులు కాదా! అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అర్హులందరికీ రైతుబంధు సాయం అందించిందన్నారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చౌదరిగూడ/ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రైతు భరోసా వానాకాలం నిధులు వారివారి ఖాతాల్లో జమకావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా రైతు భరోసా పెట్టుబడి సాయం ఎకరాకు రూ.6వేల చొప్పున వానాకాలం డబ్బులు ప్రభుత్వం విడుదల చేయడం పట్ల ఆమనగల్లు మండల రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కాయితి చిన్నారెడ్డి, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. ఈమేరకు నిర్వహించిన సమావేశంలో రెడ్డి సేవా సంఘం నాయకులు రూపం వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహరెడ్డి, భగవాన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తలకొండపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నిరసిస్తూ తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామస్థులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపట్టారు. గట్టిప్పలపల్లిలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, గంటల తరబడి సరాఫరా కావడం లేదన్నారు. రాత్రివేళ్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని గ్రామస్థులు వాపోయారు. విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండ చూడాలని వారు కోరారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీసర్పంచ్ జయమ్మవెంకటయ్య, నాయకులు కృష్ణయ్య, ఏదుల రాజు, జంగయ్య, శరత్ చంద్ర, అశోక్‌గౌడ్, బొల్లి కృష్ణయ్య, మ్యాక శ్రీనివాస్‌రెడ్డి, రాములు, విజయ్, రైతులున్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అనురాధా పత్యానాయక్

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, వానాకాలం రైతు భరోసా పెట్టుబడి సాయం రైతులందరికీ అందజేయాలని మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా మోసగించిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ సరిగ్గా అమలు చేయలేదని, పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, పంతునాయక్, శ్రీనునాయక్, సాలయ్య, చుక్క నిరంజన్‌గౌడ్, సాయిలు, రమేశ్‌నాయక్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన మరమ్మతుకు కృషి

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ భవనానికి మరమ్మతు చేయిస్తానని మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య తెలిపారు. బుధవారం భవనాన్ని సందర్శించారు. పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయని అంగన్‌వాడీ టీచర్ అరుణమ్మ తెలిపారు. స్పందించిన లలితజ్యోతయ్య త్వరలో భవనానికి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. మాజీ వార్డు సభ్యుడు దశరథ, నాయకులున్నారు.

కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా గోపికృష్ణ


గోపికృష్ణను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య

కేశంపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపికృష్ణ కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించిన ఏడీఏ రాజారత్నం పదోన్నతిపై నారాయణపేట జిల్లాకు వెళ్లారు. ఈమేరకు గోపికృష్ణను కలెక్టర్ నారాయణ రెడ్డి ఇక్కడ నియమించారు. ఈమేరకు ఆయన్నుఉ ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీఏ అజీజ్‌లు శాలువాతో సత్కరించారు. అనంతరం కార్యదర్శులతో గోపికృష్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

సంక్షిప్తంగా

షాబాద్ : నాగర్‌గూడ అంగన్‌వాడీ నుంచి ప్రాథమిక పాఠశాలలో 16మంది విద్యార్థులను చేర్పించి వారికి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : దెబ్బడగూడ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు మల్లెపల్లి కృష్ణ తెలిపారు. అధ్యక్షుడిగా ఆర్.వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.బాల్‌రాజ్, ఎం.రాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లెపల్లి ప్రభుదాసులను ఎన్నుకున్నారు.

తలకొండపల్లి : వెంకట్రావ్‌పేట బీసీ కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీకాంత్‌లకు వినతిపత్రాలందజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మాడ్గుల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పెట్టుబడి సాయి ఎకరాకు రూ.6వేల చొప్పున వానాకాలం డబ్బులు విడుదల చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. మాడ్గుల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులతో కలిసి మాజీ ఎంపీపీ జంగయ్య, మాజీ ఎంపీటీసీ దేవయ్యగౌడ్‌లు, నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. నాయకులు గౌని అరవింద్ గౌడ్, శ్రీను, కాట్ల అచ్చయ్య, మెట్టు వెంకటయ్య, జింకల భాస్కర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జంగయ్య, నాయకులు

క్రైం కార్నర్

ఎద్దు అపహరణ కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్రీకాంత్

తలకొండపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో మూడు రోజులక్రితం జరిగిన ఎద్దు దొంగతనం కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ కేసు వివరాలను వెల్లడించారు. చుక్కాపూర్ గ్రామానికి చెందిన బైకని పర్వతాలు యాదవ్ శనివారం రాత్రి పొలం వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం పాలు పితకడానికి వెళ్లగా పాకలో ఒక్కటే కాడెద్దు ఉంది. మరొకటి కన్పించకపోవడంతో పక్క పొలాల రైతులను ఆరా తీయగా ఎద్దు జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ జాషువా సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి విచారించగా ఆమనగల్లుకు చెందని మునావర్, నటరాజ్, ప్రదీప్, అచ్చంపేటకు చెందిన సిద్ధు, తాండూరుకు చెందిన రామ్ చరణ్‌లుగా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఎద్దును హైదరాబాద్‌కు చెందిన నదీమ్, అనిల్‌కు అమ్మినట్లు నిందితులు తెలిపారు. వారి నుంచి రూ.60వేలు, 2 బైక్‌లు, టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనపర్చుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. సకాలంలో కేసు ఛేదించగా ట్రైనీ ఎస్సై కే.శేఖర్, కానిస్టేబుల్ జాషువాలను ఎస్సై అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు.

అదృశ్యమైన తల్లీ కూతుళ్ల ఆచూకీ లభ్యం

కేశంపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కుమారుడితో గొడవపడి ఇద్దరు కూతుళ్లతో సహా ఇంటినుంచి వెళ్లిపోయిన తల్లి, పిల్లల ఆచూకీని కేశంపేట పోలీసులు తెలుసుకున్నారు. ఈమేరకు వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండలం వేముల్‌నర్వకు చెందిన దోల సుజాత పెద్ద కుమారుడు అభిలాష్‌తో గొడవపడి ఈ నెల 2న తన ఇద్దరు కూతుళ్ల గౌతమి(5), ప్రవళిక(2)లను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో గత శనివారం భర్త శేఖర్ కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నరహరి విచారణ చేపట్టారు. సుజాత హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వెళ్లి, అక్కడి నుంచి నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరాలయం వెళ్లినట్లు గుర్తించారు. అక్కడి నుంచి బుధవారం తీసుకొచ్చి భర్త శేఖర్‌కు అప్పగించారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్సై నర్సింలు శెట్టి, పీసీ అశోక్ రెడ్డిలను సీఐ నరహరి అభినందించారు.

వృద్ధుడు అదృశ్యం.. కేసు నమోదు


సహదేవ్

శంకర్‌పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి ఓ వృద్ధుడు బయటకెళ్లి తిరిగి రాలేదు. జన్వాడ గ్రామానికి చెందిన అప్పగళ్ల మల్లేష్ జూన్ 7న తన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లి రెండు రోజుల అనంతరం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో మల్లేష్ తండ్రి సహదేవ్(60) ఇంటి వద్ద కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసినవారి ఇళ్ల లో ఆరా తీయగా ఫలితం లేకపోయింది. ఈమేరకు బుధవారం మో కిల పోలీసులకు మల్లేష్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట


ప్రొసీడింగ్స్ అందిస్తున్న శ్రీనివాస్ యాదవ్

మొయినాబాద్ రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని యువజన కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎల్లపల్లి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం బాకారం జాగీర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నాయకులతో కలిసి ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, అనిల్, రాములు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

మాడ్గుల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మాడ్గుల మండలం నల్లవారిపల్లిలో స్వయంభువ శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని వెంకటేశ్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు గ్రామ నాయకులు, ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, లాలయ్యగౌడ్, వెంకటనారాయణ, శ్రీను, నారాయణ గౌడ్, శ్రీశైలం, సత్తయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ



తలకొండపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో బుధవారం గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మెడికిట్లను సమకూర్చారు. గ్రామంలోని గర్భిణులకు ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు వాటిని పంపిణీ చేశారు. నాయకులు, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలు తగ్గించండి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై విధించిన అదనపు బస్‌పాస్ చార్జీల భారాన్ని తగ్గించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్ అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎం.సుధాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. విద్యార్థుల బస్సు చార్జీలను 20శాతం పెంచడం అన్యాయమని, పెంచిన చార్జీలను తగ్గించాలని కోరారు. ఆకాష్‌నాయక్, రాహుల్, శ్రీనులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు శుభాకాంక్షల వెల్లువ



షాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమాచార కమిషనర్‌గా నియమితులైన పీవీ శ్రీనివాస్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు సీనియర్ జర్నలిస్టు యాస మల్లారెడ్డి పీవీ శ్రీనివాస్‌ను బుధవారం నగరంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లారెడ్డి మాట్లాడుతూ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని శ్రీనివాస్ సేవలను కొనియాడారు. విలువలతో కూడిన జర్నలిస్టుగా నేటి తరం జర్నలిస్టులకు శ్రీనివాస్ మార్గదర్శకంగా నిలుస్తారని అన్నారు.